
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
3

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
సోమవారం 16 సెప్టెంబరు 2024


రాజీవ్ భీమా ఎత్తిపోతల నుంచి విడుదలవుతున్న నీరు

నీరున్నా.. నిరుపయోగం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో కేటాయింపుల మేర జరగని నీటి ఎత్తిపోత
- నికర, వరద జలాలు రెండింటినీ వినియోగించుకోలేని పరిస్థితి
- స్టోరేజీ రిజర్వాయర్లు లేకపోవడం, చెరువులపై ఆధారపడటమే కారణం
- వరద రోజులు ఎక్కువగా నమోదు కాకపోతే ఆయకట్టుపై ప్రభావం
- నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా-1, 2, కోయిల్‌సాగర్ అన్నింటిదీ అదే దుస్థితి


రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం


కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి విడుదలవుతున్న నీరు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా అంటే కరువు, వలసలకు ప్రసిద్ధి. సమీపంలో రెండు నదులు ప్రవహిస్తున్నా పాలమూరు భూములకు సాగునీరు ఇచ్చుకోలేని దైన్యం ఆనాటిది. ఎప్పుడు చూసినా కరువు వార్తలే పతాక శీర్షికలో దర్శనమిస్తున్న తరుణంలో.. ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటికి ఢోకా లేకుండా చేసేందుకు ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఏళ్లుగా నాన్చి నాన్చి దాదాపు ఎనిమిదేళ్ల క్రితం నుంచి ఆ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందించడం ప్రారంభించారు. అయినా ఇప్పటికీ సాగునీటికి నోచుకోలేని భూములు లక్షల ఎకరాల్లో ఉన్నాయి. పీఆర్‌ఎల్‌ఐ మినహా మిగిలిన ఎత్తిపోతల పథకాలకు దాదాపు 100 టీఎంసీల నికర, వరద జలాలను కేటాయించగా దాదాపు 50 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేస్తున్నారు. గత సంవత్సరం మినహా దాదాపు ఎనిమిదేళ్లుగా కృష్ణానదికి సమృద్ధిగానే వరదలు వస్తున్నాయి. వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతోంది. కానీ, కేటాయింపుల మేర నీటిని మాత్రం వినియోగించుకోవడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఆయా ఎత్తిపోతల పథకాల కింద నీటిని నిల్వ చేసుకోవడానికి సరిపడా నిల్వ సామర్థ్యం లేకపోవడం, కొన్ని రిజర్వాయర్లలో అసంపూర్తి పనుల వల్ల పూర్తిస్థాయిలో నింపుకోలేకపోవడం, డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్‌ఛానల్ వ్యవస్థను కాకుండా గొలుసుకట్టు చెరువులపై ఆధారపడటమేనని చెప్పవచ్చు. వర్షాధారంగా గొలుసుకట్టు చెరువులు మెజారిటీ సంవత్సరాల్లో నిండుతుండటంతో నీటిని లిఫ్ట్ చేస్తే స్టోరేజీకి వసతి లేకపోవడం, ఆయకట్టు ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానల్ వ్యవస్థ ద్వారా స్థిరీకరించకపోవడం వల్ల ఈ పరిస్థితులు ఎదురవుతున్నాయి. అదనపు రిజర్వాయర్లు లేదా ఆన్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించాలని పాలమూరు అధ్యయన వేదిక, ఇతర పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ఒకటి రెండుచోట్ల మినహా ఎక్కడా పనులు ప్రారంభించలేదు. నెట్టెంపాడు, భీమా 1, 2, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతలు అన్నింటిలో కేటాయింపుల మేర లిఫ్టింగ్ జరగడం లేదు. వరద సమృద్ధిగా వస్తున్న సమయంలోనూ మోటార్లను నిలిపివేసుకోవాల్సిన దుస్థితి ఉంది.

మూడింట రెండొంతులే...

జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద వరద రోజుల్లో 21.425 టీఎంసీలను జూరాల బ్యాక్ వాటర్ నుంచి లిఫ్ట్ చేసి జోగుళాంబ గద్వాల జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీరందించేందుకు డిజైన్ చేశారు. ఈ పథకానికి ఇప్పటివరకు రూ. 2754 కోట్లు కేటాయించగా 1.42 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రధానమైన 99బీ, సీ, డీ, 100 ప్యాకేజీలు రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. వీటికింద దాదాపు 58 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలి. ఇప్పటివరకు నీరందిస్తున్నామని చెబుతున్న 1.42 లక్షల ఎకరాలకు కూడా నీరందడం లేదు. ర్యాలంపాడు లీకేజీల కారణంగా 4 టీఎంసీలకు బదులు 2 టీఎంసీల నీటిని మాత్రమే స్టోర్ చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాల నీటి లిఫ్టింగ్‌ను పరిశీలిస్తే 2021-22 వాటర్ ఇయర్‌లో 8.858 టీఎంసీలను లిఫ్ట్ చేయగా 2022-23 వాటర్ ఈయర్‌లో 6.621 టీఎంసీలు, 2023-24 వాటర్ ఇయర్‌లో 6.88 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేశారు. ఈ ఎత్తిపోతలకు మొత్తం 21.425 టీఎంసీల కేటాయింపులు ఉండగా.. 2021-22 మినహా మూడింట రెండొంతుల నీటిని కూడా లిఫ్ట్ చేసుకోలేని పరిస్థితి ఉన్నది. ఈ ఎత్తిపోతలు పూర్తిచేసి నీరందించాలంటే రూ. 242 కోట్లు అవసరం. అలాగే ఇటీవల ప్రభుత్వం ర్యాలంపాడు లీకేజీలను అరికట్టడానికి రూ. 153 కోట్లు అంచనా వేసింది.

కేఎల్‌ఐలో స్టోరేజీ కరువు...

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అతి ఎక్కువ ఆయకట్టుకు నీరందిస్తున్న ఎత్తిపోతలు కల్వకుర్తి.. ఈ పథకం 3.65 లక్షల ఎకరాలకు నీరందించేందుకు శ్రీశైలం సోర్స్‌గా నిర్మించారు. 25 టీఎంసీల వరద జలాల ఆధారంగా నిర్మాణం చేపట్టగా గత బీఆర్‌ఎస్ 40 టీఎంసీలకు కేటాయింపులు, లక్ష ఎకరాల ఆయకట్టు వరకు పెంచింది. వరద వచ్చినప్పుడే ఎత్తిపోయాల్సిన పథకంలో స్టోరేజీ రిజర్వాయర్లను మాత్రం నిర్మించలేదు. కేవలం 4 టీఎంసీల మేరనే స్టోరేజీ కెపాసిటీ ఉన్నది. దీంతో గొలుసుకట్టు చెరువులను నింపడానికి నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆటోమెటిక్‌గా చెరువులు నిండిపోతున్నాయి. ఈ పథకంలో 40 ఆన్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించాలని ప్రతిపాదించగా బుద్ధారం, గణపసముద్రం చెరువులను మాత్రమే రిజర్వాయర్లుగా మారుస్తున్నారు. 2018లో 35 టీఎంసీలు, 2019లో 49 టీఎంసీలు, 2020లో 30 టీఎంసీలు, 2021లో 31.71టీఎంసీలు, 2022లో 37 టీఎంసీలు, 2023లో 30 టీఎంసీలను ఎత్తిపోసినట్లు గణంకాలు చెబుతున్నాయి. అయితే ఈ ఎత్తిపోసిన నీటిలో మిషన్ భగీరథ పథకానికి 7.50 టీఎంసీలను కేటాయిస్తున్నారు. అవిపోను మిగిలిన మొత్తం కేటాయింపుల మేర లిఫ్ట్ చేయడం లేదనే చెప్పవచ్చు. ప్రధానంగా స్టోరేజీ రిజర్వాయర్ల సమస్య ఎక్కువగా ఉన్నది. ప్రతీ నియోజకవర్గానికి 10 టీఎంసీల చొప్పున రిజర్వాయర్లు ఉండాలనే ప్రతిపాదన ఉండగా ఇప్పటికీ ఆచరణ సాధ్యం కావడం లేదు.


నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం

కేటాయింపుల్లో సగమే వినియోగం...

రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకానికి 20 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉన్నాయి. వాటిని రెండు దశల్లో ఎత్తిపోసి 2.03 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి. కానీ, ఇప్పటివరకు సగం ఆయకట్టుకు మాత్రమే నీరందిస్తున్నారు. స్టేజ్-1 కింద 92 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా.. ఒక్క భూత్పూరు రిజర్వాయర్ పూర్తికాగా సంగంబండ రిజర్వాయర్ ఇంకా పునరావసం, బండ పేల్చివేత పెండింగ్‌లోనే ఉండటంతో నీటిని కేటాయింపుల మేర లిఫ్ట్ చేసుకోవడం లేదు. స్టేజ్-2 కింద 1.11 లక్షల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా 64,300 ఎకరాలకు మాత్రమే నీరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. శంకరసముద్రం, రంగసముద్రం రిజర్వాయర్ల పునరావాస సమస్యలు ఉండటంతో పూర్తిస్థాయిలో నింపడం లేదు. అలాగే చెరువులపై ఆధారపడటం వల్ల కూడా తక్కువ నీటిని లిఫ్ట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. మొత్తం కేటాయింపుల్లో 2021-22 వాటర్ ఈయర్‌లో 10.68 టీఎంసీలు, 2022-23 వాటర్ ఈయర్‌లో 10.63 టీఎంసీలు, 2023-24 వాటర్ ఈయర్‌లో 9.387 టీఎంసీలను మాత్రమే లిఫ్ట్ చేశారు. దీంతో ఈ లిఫ్ట్‌కు కేటాయించిన 20 టీఎంసీల్లో ఏడు టీఎంసీలను ఇటీవల కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక కోయిల్ సాగర్ లిఫ్ట్‌కు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ జూరాలకు ఉన్న 11 టీఎంసీల కేటాయింపులో వినియోగించని 2.9 టీఎంసీలను నికర జలాలు కేటాయించగా అక్కడా అదే పరిస్థితి. 2021-22లో 2.04 టీఎంసీలు, 2022-23లో 0.46టీఎంసీలు, 2023-24లో 2.56టీఎంసీలను లిఫ్ట్ చేశారు.

ఆర్డీఎస్ వినియోగమేదీ..

రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) కింద ఎడమ కాలువకు 17.1 టీఎంసీలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయించగా అందులో 15.9 టీఎంసీలు మహబూబ్‌నగర్ వాటా, దీనిద్వారా 87500 ఎకరాలకు నీరివ్వాలి. కాలువ పొడవు ఎక్కువ కావడం, నీటి విడుదల సమయంలో కర్ణాటక ఎక్కువగా వాడుకోవడం, కాలువలకు మరమ్మతులు లేకపోవడం వంటి కారణాలతో దాదాపు ఆరు టీఎంసీలను కూడా వినియోగించుకోవడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా రాజోలి వద్ద తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్మించింది. దీనిద్వారా కాలువ ద్వారా వచ్చిన ఆయకట్టుపోను 55,600 ఎకరాలకు నీరివ్వాలి. ఇక్కడ బిగించిన పంపుల్లో ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మూడు పంపులు పనిచేస్తే డెలివరీ సిస్టర్న్, కాలువల సామర్థ్యం సరిపోదు. అలాగే ఇక్కడ లిఫ్ట్ చేసిన నీటిని స్టోర్ చేసుకోవడానికి మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ, కేవలం ఆర్డీఎస్ కాలువలో నీటిని వదిలి చేతులు దులుపుకున్నారు. 55,600 ఎకరాల్లో సగానికి కూడా నీరివ్వడం లేదు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి


- 17 బైక్‌లు, 8 మొబైల్స్, రూ.13వేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బుర్రి గోవర్ధన్

బిజినేపల్లి, సెప్టెంబరు 15: కోళ్ల పందెం స్థావరంపై మెరుపు దాడి చేసి, పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి గోవర్ధన్ ఆదివారం తెలిపారు. బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూర్ శివారులోని చింతలబండ సమీపంలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందని చెప్పారు. తిమ్మాజిపేట మండలం చేగుంటకు చెందిన గంటల నరేష్ ఆధ్వర్యంలో పందేలు నిర్వహిస్తున్నట్లు తెలియడంతో సీఐ కనకయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐలు నాగశేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డితో పాటు 20 పోలీసు సిబ్బంది దాడులు చేశారని తెలిపారు. పది మందిని అదుపులోకి తీసుకోగా, మరో 20 మంది పరారైనట్లు వివరించారు. పట్టుబడ్డ వారి నుంచి నాలుగు పందెం కోళ్లను, 17 బైక్‌లను, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ.13 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించినట్లు పేర్కొన్నారు. కోళ్ల పందేలు, పేకాటతో మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా కుదేలై, అప్పుల బారిన పడుతున్నాయని అన్నారు. పారిపోయిన వారిని గుర్తించి, రిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

జీఎంఆర్ తండ్రికి సీఎం నివాళి

- దమగ్నాపూర్‌లో జరిగిన దశదినకర్మకు హాజరైన రేవంత్‌రెడ్డి
- పాల్గొన్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- కుటుంబ సభ్యులకు పరామర్శ


కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 15: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి తండ్రి క్రీ.శే. కృష్ణారెడ్డి దశదిన కర్మకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఉదయం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలిక్యాప్టర్ బయల్దేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ సమీపంలో వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. సీఎం వెంట టీపీసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో వచ్చారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా గ్రామంలోని మధుసూదన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అక్కడ సీఎం కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలు వేసి, నివాళి అర్పించారు. జీఎంఆర్ తల్లి పద్మమ్మ, సోదరుడు భాస్కర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. సీఎంతో పాటు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, గద్వాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి తనయుడు కొత్తకోట కార్తీక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

దమగ్నాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి, అడిషనల్ ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ,ఎస్ఐ శేఖర్‌లతో పాటు దాదాపు 600 మంది బందోబస్తులో పాల్గొన్నారు.



జీఎంఆర్ తల్లి పద్మమ్మను పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నిమజ్జన వేడుకలకు.. సర్వం సిద్ధం

- నారాయణపేటలో నేటి అర్ధరాత్రి నుంచి ప్రారంభం
- ఆకట్టుకోనున్న అలంకరణలు
- మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి


ఉత్సవాలకు కాషాయ రంగు టోపీలను కొంటున్న నిర్వాహకుడు

నారాయణపేట, సెప్టెంబరు 15: నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి నుంచి గణేష్ నిమజ్జన వేడుకలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం రాత్రి వరకు ఏకధాటిగా కొనసాగే ఈ వేడుకలకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రోడ్లపై ఉన్న గుంతలను మొర్రం, కంకర, డస్ట్ వేసి పూడ్చారు. నిమజ్జన అలంకరణల కోసం విద్యుత్ స్తంభాలకు స్విచ్ బోర్డులను ఏర్పాటు చేశారు. నీటి వసతి కల్పించారు. ప్రార్థనా మందిరాలను షామీయానాలతో కప్పారు.


నారాయణపేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం

విగ్రహాలను నారాయణపేట కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేయనున్నారు. ఈ చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చి, సుందరీకరించారు. వినాయక ఘాట్ ఏర్పాటు చేయడంతో నిమజ్జనాలకు అనువుగా మారింది.

జోరందుకున్న రంగుల కొనుగోలు

వేడుకల్లో ఆనందోత్సాహాల మధ్య గులాల్ రంగులను చల్లుకుంటారు. దాంతో రంగులతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులు, కాషాయం టోపీలు, స్టిక్కర్లు, రిబ్బన్లను కొనుగోలు జోరందుకుంది. రంగులు ఐదు కిలోల బ్యాగు రూ.400కు విక్రయిస్తున్నారు. ఈ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 టన్నుల వరకు రంగులు విక్రయాలు జరుగుతాయనేది అంచనా.

గణేష్ టీషర్ట్‌లకు క్రేజ్

వినాయకుడి చిత్రంతో పాటు గణపతి బప్పా మోరియా, గణేష్ అక్షరాలతో వివిధ రంగుల్లో విక్రయించే టీ షర్ట్‌లకు ఎనలేని క్రేజ్ నెలకొంది. నాణ్యతను బట్టి ఒక్కో టీషర్ట్ రూ.200 నుంచి రూ.300 వరకు, తెల్లవి రూ. రూ.300 నుంచి రూ.400 వరకు ధరలు పలుకుతున్నాయి. గణేష్ టోపీలు రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. గణేష్ బ్యాడ్జీలు రూ.25 నుంచి రూ.35 వరకు, రిబ్బన్లు రూ.25 నుంచి రూ.35 వరకు , కండువాలు రూ.80 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు.

నిజాం పాలన నుంచి..

నారాయణపేట పట్టు, కాటన్ చీరలు, నాణ్యమైన బంగారంతో పాటు గణేష్ ఉత్సవాలకు ప్రసిద్ధి గాంచింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనానికి ఇక్కడ నిర్వాహకులు పోటాపోటీగా సామాజిక, రాజకీయ, సాంకేతిక, ఆధ్యాత్మిక అంశాలపై ఏర్పాటు చేసే అలంకరణలు ఆకట్టుకుంటాయి. పట్టణంలో నిజాం పాలన నుంచే గణేష్ సంబురాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 1940లో మొదటిసారి స్వాతంత్ర్య సమర యోధుడు నాగర్‌కర్ కిషన్‌రావు ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారని స్థానిక పెద్దలు చెప్తుంటారు. ఆ తర్వాత బ్రహ్మణ్‌వాడి వీధిలోని ప్రజానంద్ దీక్షితుల ఇంట్లో గణపతిని ప్రతిష్ఠించి, రాత్రంతా జాగరణ అనంతరం మరుసటి రోజే నిమజ్జనం చేసేవారని అంటారు. అప్పట్లో పట్టణానికి మహారాష్ట్ర నుంచి వచ్చిన పలువురు తమ ప్రాంతంలో వేడుకలను ఎలా జరుపుకుంటారో చెప్పారని, నాటినుంచి నారాయణపేటలో కూడా పది రోజుల పాటు విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేస్తున్నారని చెబుతున్నారు.

మిల్లు వ్యర్థ జలాలతో చెరువు కలుషితం

- చర్మ రోగాల బారిన పశువులు
- ఆందోళనలో గ్రామస్థులు


చెరువులో కలుషితమైన నీటిని చూపుతున్న గ్రామస్థులు

వీపనగండ్ల, సెప్టెంబరు 15: వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల కొత్త చెరువులోకి బాయిల్డ్ రైస్‌మిల్లు వ్యర్థపు నీరు చేరడంతో చెరువు కలుషితమైంది. దుర్వాసనతో కూడిన ఆ కలుషిత నీళ్ల తాగడం వల్ల పశువులు చర్మ రోగాల బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గత శుక్రవారం నిరసన తెలిపారు. పెబ్బేరు మండలం శ్రీరంగాపురం శివారులోని ఆల్ అజిత్ అగ్రి ఇండస్ట్రీస్ బాయిల్డ్ రైస్ మిల్లులో వడ్లు ఉడికించిన తరువాత వెలువడే వ్యర్థపు నీటిని పక్కనే ఏర్పాటు చేసిన గుంతలో నిల్వ చేశారు. ఆ నీరు దుర్వాసన వస్తుండటంతో పక్కనే ఉన్న పాటు కాలువలోకి వదిలారు. ఆ కాల్వ ద్వారా నీరు కొత్త చెరువులోకి చేరిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఆ నీరు వల్ల చెరువు కలుషితమవడంతో పాటు పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

పశువులకు బొబ్బలు

చెరువులో కలిసిన ఆ నీటితో పశువులను కడుగగా, బొబ్బలు వచ్చి చర్మ వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువులో గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ట్యాంకులు ఉన్నాయని, చెరువు నీరు కలుషితం కావడం వల్ల వాటిని తాగితే ప్రజలూ రోగాల బారిన పడే ప్రమాదం ఉందని అంటున్నారు. రైస్ మిల్లు యజమానిపై చర్యలు తీసుకొని, కలుషిత నీరు చెరువులో చేరకుండా చూడాలని మాజీ ఉప సర్పంచు నరేష్, గ్రామస్థులు కురుమయ్య, విజయ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు.

పరిశీలించిన అధికారులు

రైస్ మిల్లు వ్యర్థ జలాలు కలిసి చెరువును నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ వసంత లక్ష్మీ రాణి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు గత శుక్రవారం పరిశీలించారు. నీటి శాంపిల్స్ టెస్టులకు పంపించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యజమానిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయమై మిల్లు యజమాని వహీదుద్దీన్‌ను వివరణ కోరగా, మిల్లు నుంచి వెలువడే వృథా నీటిని గుంతలో నిలువ చేస్తామని చెప్పారు. వర్షాల వల్ల గుంత నిండి, నీళ్లు బయటకు వచ్చాయన్నారు. ఆ నీటిలో ఎలాంటి రసాయన వ్యర్థాలు లేవన్నారు.


చర్మ వ్యాధి సోకిన ఎద్దును చూపుతున్న రైతు

దర్జాగా ఫిల్టర్ ఇసుక తయారీ

- ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఏర్పడిన గుంతలు



ఉదండాపూర్ రిజర్వాయర్‌లో మట్టిదిబ్బలను తోడుతున్న ఎక్స్‌కవేటర్

జడ్చర్ల, సెప్టెంబరు 15 : సాగు, తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయ ర్.. ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రంగా మారింది. ఇసుక వ్యాపారులు రిజర్వాయర్‌లో ఉన్న మట్టి దిబ్బ లలో ఫిల్టర్ ఇసుకను దర్జాగా తయారు చేస్తున్నారు. దాడులు చేసి కేసులు నమోదు చేయ డం, జరిమానా విధించాల్సిన మైనింగ్ అధికారులు పత్తాలేకుండా పోయారు. జడ్చర్ల, నవాబ్‌పేట మండలంలోని సుమారు 5,200 ఎకరాలలో పాలమూరు - రంగా రెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లో తమ భూములు కోల్పోయి, గ్రామాలు ముంపునకు గురై సర్వం కోల్పోతున్నాం.. తమకు న్యాయం చేయాలంటూ నిర్వాసి తులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, అందుకు భిన్నంగా ఇసుక అక్రమ వ్యాపారులకు ధనార్జన కేంద్రంగా మారింది. రిజర్వాయర్‌లలో మట్టిదిబ్బలు ఉండి, నీళ్ల ఉన్న ప్రాంతాలలో ఏకంగా మోటార్‌లను ఏర్పాటు చేసుకు న్నారు. మట్టిని లారీలలో లోడింగ్ చేసి నీళ్లను నింపి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. ప్రతి రోజు రాత్రి, పగలు అన్న తేడా లేకుండ టిప్పర్‌లలో ఇసుకను తరలిస్తున్నారంటూ ఉదండాపూర్, వలూ ్లరు, ఖానాపూర్, కిష్టారం గ్రామా ల ప్రజలు ఆరోపి స్తున్నారు. రిజర్వాయర్ కట్టకు సమీపంలోనే ఫిల్టర్ ఇసుకను తయారీని అడ్డుకు నేందుకు వెళ్లిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇసుక లోడుతో టిప్పర్‌లు వెళ్లడంతో ఇప్పటికే రోడ్డంతా దెబ్బతింది. పోలీసులకు సమాచా రం అందింతే తప్పించు కునేందుకు కొందరు జడ్చర్ల ఆర్ అండ్ బీ అతిథిగృ హం, పోలేపల్లి, కిష్టారం ప్రాంతాలలో సమాచారం ఇచ్చేందుకు నిఘా వ్యవస్థ ను ఏర్పాటు చేసుకున్నా రు. టిప్పర్‌లను అతివేగంగా నడుపుతుండడంతో సెజ్‌లోని పరిశ్రమలలో విధులు నిర్వహించేందుకు వచ్చిన వారు పలు పర్యాయాలు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఇప్పటి కైనా కృత్రిమ ఇసుక తయారీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



మట్టిని తోడడంతో ఏర్పడిన గుంతలు

గుర్తు తెలియని వాహనం ఢీ

- బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి


నారమోని శ్రీను (ఫైల్)

చారకొండ, సెప్టెంబరు 15: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రానికి చెందిన నారమోని శ్రీను (40) కొంత కాలంగా నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్రీను సొంత లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10న లారీ లోడుతో కర్ణాటక వెళ్లాడు. శ్రీను బైక్‌పై కుర్మేడ్ గ్రామానికి వస్తుండడంతో ఆదివారం తెల్లవారుజామున చారకొండ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. శ్రీను తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలను సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణ మండలంలో మరొకరు..


సంగప్ప (ఫైల్)


కృష్ణ, సెప్టెంబర్ 15 : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హిందుపూర్ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. కృష్ణ మండల కేంద్రానికి చెందిన సంగప్ప ద్విచక్రవాహనంపై హిందుపూర్ వాగు సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీద్ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


శివకుమార్ (ఫైల్)


మదనాపురం,సెప్టెంబరు15: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన శివకుమార్(28)ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం పట్టణ సమీపంలో గల రైల్వే బ్రిడ్జిపై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించగా ఒక తమ్ముడు ఉన్నాడు. ఈయనకు వివాహం కాలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియవని స్థానికులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాలకు తరలించారు.

'వేదంత దర్శిని' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, ఆచార్యులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 15 : జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ మందిరంలో ఆదివారం పండిట్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏహూరి కిష్టప్ప రచించిన వేదాంత దర్శిని (సంకలనం) పుస్తకాన్ని డాక్టర్ మురళీధర్‌రావు, ఎం. కృష్ణారావు, డాక్టర్ భరద్వాజ్, రచయిత దోరేటి చెన్నయ్య, శతవదాని ములుగు అంజయ్య అతిథిగా హాజరై అవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. వచ్చే తరాల వారికి జ్ఞానాన్ని అందించాలన్న విధంగా వేదాంత దర్శిని రచించబడిందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వంచే గౌరవించబడి విద్యార్థులను తీర్చిదిద్ది అక్కడితో తన బాధ్యత పూర్తయిందని అనుకోకుండా, పదవీవిరమణ తర్వాత కూడా తన రచనల ద్వారా ఏహూరి కిష్టప్ప ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయిని భాగన్న గౌడ్, ప్రధానాచార్యులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసుల డ్యాంకు తగ్గుతున్న వరద


సుంకేసుల డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

రాజోలి, సెప్టెంబరు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతుంది. ఆదివారం సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 20,300 క్యూసెక్కులు వరద వస్తుండటంతో, 4 గేట్ల ద్వారా 17,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 1.20 టీఎంసీ ఫుల్ లెవల్ నీటితో ఉందని జేఈ రాజు తెలిపారు. అదేవిధంగా కర్నూలు కేసీ కెనాల్‌కు 2,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు శేఖర్

హన్వాడ, సెప్టెంబరు 15 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల విశ్వబ్రాహ్మణ కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వడ్ల శ్రీహరిచారి ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఇబ్రహీంబాద్ చెందిన సత్తయ్యచారిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బ్రహ్మచారి, రామకృష్ణచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వడ్ల శ్రీహరిచారి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌చారిలతో పాటు సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ విశ్వకర్మల సమస్యల పరిష్కారం కోసం కమిటీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో శేఖర్, శివ, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

మహమ్మదాబాద్, సెప్టెంబరు 15 : భర్తతో గొడవతో ఉరేసుకుని భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని మొకర్లబాద్ చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొకర్లబాద్ చెందిన గడ్డమీది దస్తమ్మ(28) సంసారం విషయంలో ఆదివారం మధ్యాహ్నం భర్తతో గొడవపడి మనస్తాపం చెందింది. దీంతో ఆమె బాత్‌రూంలో ఉరే సుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి తండ్రి బాలప్ప ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారంలో వాజీద్ మహేక్

నవాబ్‌పేట, సెప్టెంబరు 15: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ బాధ్యతల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మండలంలోని యన్మనగండ్ల కాంగ్రెస్ రాష్ట్ర సేవాదల్ చీఫ్ ఆర్గనైజర్ వాజీద్ మహేక్ హాజరై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నూతన అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు సేవాదల్ గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్, ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి నమ్మిన కార్యకర్త మహేష్ గౌడ్ అని ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందన్నారు.

కూలిన ఇళ్లు.. మిగిలిన కన్నీళ్లు

- దయనీయ స్థితిలో బాధిత కుటుంబాల జీవనం

- డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వేడుకోలు


పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి లో వర్షానికి కూలిన సలీమ్ ఇల్లు

పెబ్బేరు, సెప్టెంబర్15: ఇటీవల భారీ వర్షం కురిసి బీభత్సం సృష్టించడంతో వందలాది పేద కుటుంబాల ఇళ్లు కూలిపోయి వారి జీవనం వీధిన పడింది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 178 శిథిలావస్థకు చేరిన మట్టి మిద్దెలు వర్షానికి తడిసిపోయి కూలిపోయాయి. మూడు ఇళ్లు పూర్తిగా కూలినట్లు అధికారులు తెలిపారు. కొన్ని పాక్షికంగా కూలిన ఆఇంట్లో నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడింది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయం భయంగా కుటుంబాలు దయనీయ స్థితిలో జీవనం కొనసాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు పడిపోయిన కుటుంబాలు నివాసం ఉండేందుకు కూడా గ్రామాల్లో అద్దె ఇళ్లు లేకుండా పోయాయి. కనీసం రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకో వడానికి ఆర్థిక స్థోమత లేని పరిస్థితిగా ఏర్పడింది. కొందరు బంధువుల ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. మరికొందరికి స్థానికులు కొంతమేరకు ఆర్థిక సాయం చేయడంతో ప్లాస్టిక్ కవర్లను వేసుకుని జీవిస్తున్నారు.


కూలిన హరిజన్ ఎల్లమ్మ ఇల్లు

ప్రత్యామ్నాయం చూపడం లేదు

వర్షాలు పడుతున్న సందర్భంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండకూడదని అధికారులు చెప్పడం తప్ప ఆశ్రయం కల్పించడం లేదంటున్నారు. గతంలో వర్షాలకు పాక్షికంగా కూలిన ఇళ్లకు రూ.5వేలు, పూర్తిగా కూలిన ఇళ్లకు రూ.10వేలు తక్షణ సాయం అందించారు. ఇప్పుడు పాక్షికంగా కూలిన ఇంటికి రూ.16,500, పూర్తిగా కూలిన ఇంటికి రూ.95,100 అందిస్తున్నారు. పట్టణ ప్రాంతంలో నివసిస్తు ఇల్లు కూలిపోయిన వారు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వాలని కోరుతున్నారు. పట్టణ ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇళ్లను బాధిత కుటుంబ సభ్యులకు ఎప్పుడు నివాసం కల్పిస్తారని ఎదురుచూస్తున్నారు. అర్హతలు ఉన్న కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిదంగా మండలం, గ్రామస్థాయిలో వర్షాలకు ఇళ్లు కూలిపోయిన కుటుంబాలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.

60శాతం ఆర్థికసాయం అందజేత

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబ సభ్యులకు బ్యాంకు ఖాతాల ద్వారా నగదును అందించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 60 శాతం బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించింది. మిగతా వారికి కూడా తక్షణమే వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలి

ఇటీవల కురిసిన వర్షానికి నా ఇల్లు పడిపోయింది. ప్రభుత్వం నుంచి అందించే సాయం ఏమాత్రం సరిపోదు. మేము ఉండడానికి ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం స్పందించి మా కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలి.

- ఖాజా మైనోద్దిన్, అమరచింత మండలం

ఇల్లు కట్టుకునే స్థోమత లేదు

భార్యాభర్తలం పని చేసుకుంటే పూట గడవని పరిస్థితి మాది. వర్షానికి ఇల్లు కూలిపోయింది. మళ్లీ ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

- హరిజన్ ఎల్లమ్మ, గోవర్ధనగిరి, వీపనగండ్ల మండలం

ప్రభుత్వపరంగా సాయం అందిస్తాం

వర్షానికి జిల్లా వ్యాప్తంగా ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని అందిస్తాం. కూలిపోయిన వివరాలను తహసీల్దార్ల నుంచి సేకరించాం. బాధితుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. 60 శాతం పైగా బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందింది. ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఆర్థిక సాయం అందిస్తాం.

- పద్మావతి, ఆర్‌డీవో, వనపర్తి జిల్లా

పునరుద్ధరణ పనులను నాణ్యతగా చేపట్టాలి


లట్టుపల్లిలో భారీ వరదలకు తెగిపోయిన కేఎల్‌ఐను చూపుతున్న బాధిత రైతులు

బిజినేపల్లి, సెప్టెంబరు 15 : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు తెగి న కేఎల్‌ఐ కాలువను సంబంధిత గుత్తేదారులు పునరుద్ధరణ పనులను నాణ్యత గా చేపట్టాలని పంటలు కొట్టుకపోయిన బాధిత రైతులు ఆదివారం డిమాండ్ చేశారు. మండలంలోని లట్టుపల్లి శివారులోని కేఎల్‌ఐ బ్రాంచ్ కెనాల్ కాలువ యూటీ వద్ద తెగి పంటల కొట్టుకపోయి పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయా రు. మరోసారి వరదలు వస్తే తెగిపోయేలా నాసిరకంగా మట్టి పోసి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ కాలువ దెబ్బతిన్నదో అక్కడ మరమ్మతు చేపట్టాలని రైతులు గోవిందు నాయక్, చంద్ర గౌడ్, సంతోష్ రెడ్డి కోరారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న యాదవ కులస్థులు

చారకొండ, సెప్టెంబరు 15: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లిలో యాదవ కులస్థులు తమ ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా పెద్దమ్మతల్లికి బోనాల పండుగ చేయడం ఆనవాయితీగా వస్తున్నట్లు వారు తెలిపారు. అలంకరించిన బోనం కుండలను మహిళలు నెత్తిపై పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు, పూనకాలతో ఊరేగింపుగా తరలి వెళ్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు ఎనుముల వెంకటయ్యయాదవ్, కార్యదర్శి సుల్తాన్‌యాదవ్, బిక్షపతియాదవ్, మల్లయ్యయాదవ్, రామస్వామియాదవ్, జంగయ్యయాదవ్, సాయిలుయాదవ్, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టిజన్‌లను కన్వర్షన్ ఉద్యోగులుగా గుర్తించాలి

అచ్చంపేట, సెప్టెంబరు 15 : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం అచ్చంపేట పరిధిలోని హాజీపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఆర్టిజన్ స్పాట్ బిల్లింగ్ ఎస్పీఎం కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను మోసచేసిందని, అందుకే ఎన్నికల్లో విద్యుత్ ఉద్యోగులు గద్దెదింపారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పటికే ఐదు పర్యాయాలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, మున్ముందు తమ సమస్యలు పరిష్కారం కాకుంటే ఆర్టిజన్ల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

జేఏసీ కమిటీ ఎన్నిక

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్, గౌరవ సలహాదారుడిగా మల్లేష్, గౌరవ అధ్యక్షుడిగా అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, కోశాధికారిగా వెంకట్రాం నాయక్, సెక్రటరీగా జగదీష్, సభ్యులుగా కరీం, శ్రీను, దేవేందర్, లింగంను ఎన్నుకున్నారు.

పేరుకుపోయిన చెత్త.. సమ్మెలో పారిశుద్ధ్య కార్మికులు



మహమ్మదాబాద్‌లో రోడ్లపై పేరుకుపోయిన చెత్త

మహమ్మదాబాద్ సెప్టెంబరు 15 : పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో మహమ్మదాబాద్‌లో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. మూడు రోజులుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న 12 నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం వారికి పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోరు కృష్ణయ్య, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, వేణుగౌడ్, రంగయ్య, శివరాములు పలువురు మాట్లాడారు.. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఏడాది నుంచి వేతనాలు రాలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే కలెక్టర్, డీపీవోలు స్పందించాలని కోరారు. పెండింగ్ జీతాలు ఇచ్చి రెగ్యులర్‌గా సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎక్కడ చూసినా చెత్తే..

మండలంలోని ప్రధాన వీధులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. మండల కేంద్రంలో శుక్రవారం సంత కావడంతో వ్యర్థాలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తుంది. చెత్తను తొలగించేందుకు ఇతర కూలీలను పెట్టి కార్యదర్శి, గ్రామస్తులు శుభ్రం చేయిస్తున్నా సమ్మెలో ఉన్న కార్మికులు వారి అడ్డుకుంటున్నారు. తమ సమస్య పరిష్కరించిన తర్వాత వీధులు శుభ్రం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగు రోజులుగా వీధులు, మురికి కాల్వలు శుభ్రం చేయలేదు.


దీక్షలో కూర్చున్న పారిశుధ్య కార్మికులు

హోం గార్డు వీరంగం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 15: ఇరుగుపొరుగున ఉంటున్న రెండు కుటుంబాల మధ్య విద్యుత్‌తీగ వివాదం ముదిరి దాడి చేసుకునే వరకు వెళ్లింది. మద్యం మత్తులో హోంగార్డును అన్న సంగతి మరిచి వీరంగం సృష్టించి పంచాయితీ చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. బాధితుడు ఆనంద్ అలియాస్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన ఆనంద్, హోంగార్డు మురళి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. హోంగార్డు ఇంటికి చెందిన విద్యుత్ సర్వీస్ వైర్ ఆనంద్ ఇంటిపైనుంచి వెళుతుంది. ఈ వైర్ పలు చోట్ల అతుకులు ఉండటంతో ఆనంద్ వైర్‌ను మార్చాలని, పిల్లలు మేడపైకి వెళ్లినప్పుడు షాక్ కొట్టే ప్రమాదం ఉందని పలుమార్లు మురళికి చెప్పినా ఆయన వినకపోవడంతో ఆదివారం ఆ వైర్‌ను ఆనంద్ కట్ చేశాడు. మధ్యాహ్నం తర్వాత ఆనంద్ బండమీదిపల్లి చౌరస్తాలోని తన జిరాక్స్ దుకాణానికి వెళ్లిపోగా మురళి అక్కడికి చేరుకుని దుకాణంపై దాడి చేశాడు. అద్దాలు పగలకొట్టడంతోపాటు ఆనంద్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు అతన్ని ఆపే ప్రయత్నం చేసినా మద్యం మత్తులో ఎవరిమాట వినకుండా వీరంగం చేశాడు. బాధితు డు రూరల్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుపై ఫిర్యాదు చేశా డు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఇసుక టిప్పర్ పట్టివేత

వంగూరు, సెప్టెంబరు 15: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండి చింతపల్లి దుందుభి వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం తెల్లవారుజామున సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. టిప్పరును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గాయపడిన నెమలి మృతి

గద్వాల క్రైం, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో ఆదివారం నెమలి ఎక్కడి నుంచి వచ్చిందో కానీ కాలనీలో పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇందుకు సంబంధించి వార్డు కౌన్సిలర్ తెలుగు శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 24వ వార్డులోని తెలుగుపేటలోని ఓ ఇంటిలో దాక్కున్న నెమలిని కుక్కలు వెంబడించి పట్టుకొని ఈడ్చుకుంటూ వస్తుంటే వార్డు ప్రజలు గమనించి కుక్కలను తరిమివేసి కొన ఊపిరితో ఉన్న నెమలిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. నెమలి మృతి చెందడంతో విషయాన్ని పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ ద్వారా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, సెప్టెంబరు 15 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని క్లబ్‌రోడ్డులో నివాసం ఉంటున్న అసన్ అలీఖాన్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. 2తులాల 75గ్రాముల బంగారువస్తువులు చోరీ అయ్యాయని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఇంటికి తాళం వేసి స్వస్థలమైన కొల్లాపూర్‌కు వెళ్లగా, ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన ఇంటి యజమాని చోరీ జరిగిందని గుర్తించాడు. వెంటనే అసన్‌అలీఖాన్‌కు సమాచారం అందించాడు. ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన బంగారువస్తువులు చోరీ అయ్యాయని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబరు 15 : బీహార్ రాష్ట్రం చంపారన్ జిల్లా మదుభని గ్రామానికి చెందిన సురేంద్రసా, చందేశ్వర్‌సా జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీ ప్రాంగణంలోని లేబర్‌కాలనీలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు ఈ నెల 13న రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రించగా, అదే రోజు రాత్రి 2గంటల ప్రాంతంలో తన సోదరుడు చందేశ్వర్‌సా కనిపించ లేదు. అతని ఆచూకీ కోసం పరిసర ప్రాంతంతో పాటు బంధువుల వద్ద విచారణ చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆదివారం తన సోదరుడు కనిపించడంలేదని సురేంద్రసా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠశాల డైరెక్టర్‌పై కేసు నమోదు

గద్వాల, సెప్టెంబరు 15: గద్వాల మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న తన భార్యను పంపించాలని కోరిన భర్తపై డైరెక్టర్ చేయి చేసుకున్నాడని భార్యను పంపించడం లేదని భర్త రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 9 ఫిర్యాదు చేశాడు. అంతటితో ఆగకుండా సెల్ఫీ వీడియోను విడుదల చేసి నాకు న్యాయం చేయాలని సోషల్ మీడియాలో పెట్టాడు. ఆ మరుసటి రోజు రాజీ పత్రాలు రాసుకుని రాజీ అయ్యామని మళ్లీ సోషల్ మీడియాలో పెట్టాడు. అయితే పోలీసులు కోర్టు నుంచి అనుమతి తీసుకుని శనివారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై తెలిపారు. భార్య రాజీనామాపత్రం ఇస్తే బయటకు పంపుతామని చెప్పడంతో భర్త మరుసటి రోజు రాజీ అయ్యాడని డైరెక్టర్ విలేకరులకు తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

- సగర విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల పంపిణీలో ఎం.పీ. డీకే అరుణ



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

పాలమూరు/ మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 15 : నగర సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పాలమూరు నియోజకవర్గ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం ఏనుగొండలోని సగర కమ్యూనిటీ హాల్‌లో సగర సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆమె ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ లోకంలో చదువుకు మించిన ఆస్తిలేదని, చదువు ఒకరు దోచుకెళ్లే సొత్తుకాదని, ఇలాంటి ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్వతహాగా తమ కాళ్ల మీద తాము నిలబడేలా విద్యార్థులు చదివి ఎదగాలని, తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అందిస్తున్న విశ్వకర్మ లోన్స్ వంటి ప్రతీ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయాల్లో డబ్బు కీలకంగా మారిందని, కానీ మేము 70 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ మాకు ఆ అవసరం రాలేదని తెలిపారు. ఏ సమస్యతో వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉన్నాను కాబట్టే నన్ను ప్రజలు ఎంపీగా ఆదరించారని అన్నారు. సగర సంఘం సేవా కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందించేందుకు ముందుంటానని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడ్డవారికి భవిష్యత్తు బంగారు మయమవుతుందన్నారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో కష్టపడి చదివితే మంచి జీవితం లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉప్పరి శేఖర్, జిల్లా అధ్యక్షుడు, ప్రనీల్‌చంద్, సత్యం, పర్వతాలు, నారాయణ, గోపాల్, బీసీ సమాజ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, సవారి సత్యం పాల్గొన్నారు.

19 నుంచి మాదిగల మేలుకొలుపు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 15 : ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మాదిగల మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాలకృష్ణ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ సాధన, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాదిగలకు 12శాతం రిజర్వేషన్ సాధనకు మాదిగలు ఉద్యమించాలన్నారు. మాదిగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్‌లో అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బొర్రా సురేష్, గొరిట దినేష్, అరుణ్‌కుమార్, భూపతి, వెంకట్రాములు పాల్గొన్నారు.

దళిత కాలనీలలో సమస్యలపై సర్వే



నెక్కొండలో సర్వే నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 15 : దళితులు నివసిస్తున్న కాలనీలలో నెలకొన్న సమస్యలపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, బురెడ్డిపల్లి, మాచారం, నెక్కొండ, గోప్లాపూర్ గ్రామాలలో ఆదివారం సర్వే నిర్వహించారు. దళితుల జీవితాలలో ఎలాంటి మార్పు జరగలేదని, రోజు వారి కూలీలు, ఆటో డ్రైవర్‌లు, అడ్డమీది కూలీలుగానే జీవనం సాగిస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, మంచినీటి కుళాయిలు సదుపాయాలు, సౌకర్యాలు లేవన్నారు. దళితులు మృతిచెందితే ఖననం చేయడానికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పొలమోని వెంకటయ్య, ఈర్లపల్లి యాదయ్య, సత్యమ్మ, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు



టంకరలో ఆన్‌లైన్‌లో చేసిన సభ్యత్వాన్ని చూపిస్తున్న నాయకులు

హన్వాడ, సెప్టెంబరు 15 : దేశం, ధర్మం కోసం బీజేపీ పని చేస్తుందని సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ రమణారెడ్డి అన్నారు. ఆదివారం టంకర, కొత్తపేట గ్రామాలలో పార్టీ నాయకులు ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు మాట్లాడారు. మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరంతరం దేశ అభివృద్ధికి పని చేస్తున్నారని చెప్పారు. గతం కంటే ఈ సారి ఎక్కువగా ప్రజలు సభ్యత్వాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీలు కొండ లింగన్న, రఘురాంగౌడ్, బాలగోపీ, చెన్నయ్య, కృష్ణయ్య, సిల్యానాయక్, హనుమంతు, శేఖర్, కృష్ణయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈ కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 15 : ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి గుదిబండగా మారిన ఈ కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ట్రెజరీ ద్వారానే అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మావిళ్ల లక్ష్మణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ఉపాధ్యాయులకు సంబంధించి సరెండర్ లీవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ భవిష్యనిధి తదితర నిధులు రావడం లేదన్నారు అనంతరం రాష్ట్ర మహిళ కార్యదర్శిగా ఉన్న షామెదా సూల్తానా పదవీ విరమణపొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆవుల శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

32 అడుగుల వద్ద కోయిల్‌సాగర్ నీటి మట్టం

దేవరకద్ర, సెప్టెంబరు 15 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రం నాటికి 32 అడుగుల వద్ద పాజెక్టుఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కోయిల్‌కొండ మండలం అంకిళ్ల, కొండాపూర్ నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32 అడుగుల వద్ద నీరు ఉంది. కొన్ని రోజుల కిందట ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే కోయిల్‌సాగర్ గేట్లు తెరిచారు. దీంతో ప్రాజెక్టులో తగ్గడంతో గేట్లను మూసివేశారు. ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వ ఆయకట్టుదారులకు నీటిని విడదల చేశారు. రైతులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

నేడే నిమజ్జనం

● పాలమూరులో పూజలందుకున్న గణనాథులు

- ఏర్పాట్లు చేసుకుంటున్న నిర్వాహకులు
- నాలుగు చెరువుల్లో ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- బీచుపల్లికి తరలించేవారికి బైపాస్‌లో రవాణా సౌకర్యం
- నిమజ్జనం కోసం భారీ పోలీస్ బందోబస్తు



గణనాథుడు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 15 : తొమ్మిది రోజుల పాటు భక్తజనం చేత విశేష పూజలందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనం చేయనున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని గ్రామాలలోనూ చాలా విగ్రహాలను తొమ్మిది రోజులకే కదిలిస్తుండటంతో నిమజ్జన ఊరేగింపును శోభాయమానంగా జరిపించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, లడ్డూ, కలశ వేలాలు పెద్దఎత్తున నిర్వహించనున్నారు. సాయంత్రం నుంచే ఊరేగింపు సందడి నెలకొంది. వినాయక ఉత్సవాలలో ఊరేగింపునకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. నిర్వాహకులు, యువత పెద్దఎత్తున ఊరేగింపులో పాల్గొని డీజే, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తర లించనున్నారు. అధికార యంత్రాంగం నిమ జ్జనం కోసం పాలమూరు చుట్టు పక్కల నాలుగు చెరువులలో నిమజ్జనం చేసేందుకు ఆయా చెరువుల వద్ద ఏర్పాట్లు చేసింది. అప్పన్నపల్లి గంగోస్ కుంట, శ్రీనివాస కాలనీ పాలకొండ చెరువు, తాండూర్ రోడ్‌లో చిన్న దర్పల్లి చెరువు, కోయిలకొండ రోడ్‌లోని వెంకటాపూర్ చెరువులలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక బీచ్‌పల్లిలో నిమ జ్జనం చేసేవారికి బైపాస్ రహదారిలో వాహనసౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ లారీలను ఏర్పాటుచేసి ఆసక్తి ఉన్నవారు లారీలో విగ్రహాలను ఎక్కిస్తే నిమజ్జనానికి తరలించనున్నారు.



డి. జానకి, ఎస్పీ

ఉదయం పది గంటలకు ధ్వజారోహణం

మహబూబ్‌నగర్ టౌన్ : నేడు వినాయక నిమజ్జన కార్యక్రమం ఉన్నందున గణేష్ ఉత్సవ నిమజ్జన వేదిక దగ్గర ఉదయం పది గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుందని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, నాయకులు అద్దని నరేంద్ర, హన్మంతు, లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యవర్గ సభ్యులు, వినాయక మండపాల నిర్వాహకులు తప్పక హాజరు కావాలని కోరారు. అశోక్ టాకీస్ చౌరస్తా దగ్గర లోకమాన్య బాల గంగాధర్ తిలక్ విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శోభాయాత్రలో నిబంధనలు

● శోభాయాత్రలో డీజే సౌండ్‌బాక్స్‌లను ఉపయోగించరాదు. ఏపయోగిస్తే వాటిని సీజ్ చేయడంతోపాటు చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటాము.

● విద్యుత్ తీగలు రోడ్లపై వచ్చిపోయే వాహనాలను గమనిస్తూ ఊరేగింపు నిర్వహించాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యులే బాధ్యత తీసుకోవాలి

● శోభాయాత్రలో అశ్లీల నృత్యాలు, మతవిద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పాటలను ప్రదర్శించరాదు. రెచ్చగొట్టే నినాదాలు, మతస్థలాల వద్దఊరేగింపు ఆపడం చేయరాదు

● బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధం. ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు

● నిమజ్జనం చేసే చెరువు నీటి వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలను చెరువు దగ్గరికి తీసుకెళ్లకూడదు

● నిమజ్జనదారులలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలి

● నిమజ్జన రూట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కెమెరాలు పూర్తిగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయబడినవి. సీసీటీవీ పర్యవేక్షణలో ఉంటారన్న వాషయాన్ని గుర్తించుకోవాలి

● నిమజ్జన సమయంలో ఇబ్బందులు తలెత్తితే డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712658360కు ఫోన్ చేయాలి

నిమజ్జనానికి భారీ పోలీస్ బందోబస్తు : ఎస్పీ జానకి

గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుందని జిల్లా ఎస్పీ జానకి అన్నారు. ఊరేగింపు సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. శోభాయాత్రలో పోలీస్‌శాఖ జారీచేసే సూచనలు విధిగా పాటించాలని కోరారు.

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్రం నిధులు

- పీయూ గణనాథునికి ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు

పాలమూరు యూనివర్సిటీ సెప్టెబర్ 15 : పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వినాయకునికి పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీయూలో వీజీ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థి నాయకులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు పాలమూరు యూనివర్సిటీకి సాయంత్రం చేరుకొని పూజలు చేశారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల కంటే తక్కువ నిదులతో వెనుక బడిన పాలమూరు యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 100 కోట్ల ప్రత్యేక నిధులను విడుదల చేశామని తెలిపారు. పీయూ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ టౌన్ : స్థానిక అంబ భవాని దేవాలయంలో ఆదివారం స్థానిక ఎంపీ డీకే అరుణ పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వినాయకుడిన కోరినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు

మూసాపేట : మండలంలోని జానంపేట, వేముల తదితర వినాయక చవితి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు, మహిళల ఆటపాటలు, బొడ్డెమ్మలతో మార్మోగించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

దేవరకద్ర, సెప్టెంబరు 15 : మండల కేంద్రమైన దేవరకద్రతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం వినాయక విగ్రహాల నియజ్జనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వినాయక నిమజ్జనం రోజు గణనాథుడి దగ్గర ఏర్పాటు చేసిన లడ్డూ, పండ్లకు వేలం నిర్వహించారు. దేవరకద్ర పెద్ద వినాయకుడి లడ్డూను రూ.లక్షా 20 వేలకు శివ దక్కించుకున్నాడు. దేవరకద్ర పెద్ద చెరువు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఎస్ఐ నాగన్న బందోబస్తును ఏర్పాటు చేశారు. చెరువుల దగ్గర తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఈవో సీత్యానాయక్ ఏర్పాట్లను పరిశీలించారు.



వినాయక మండపానికి బయలుదేరిన పెద్ద వినాయకుడు



హన్వాడ : నాయినోనిపల్లిలో వినాయకునికి పూజ చేస్తున్న భక్తులు

● హన్వాడ : మండలంలోని నాయినోనిపల్లి, కొనగట్టుపల్లి, చిన్నదర్పల్లి, వేపూర్, కొత్తపేట గ్రామాలలో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో వినాయకులకు పూజలు చేసి అన్నదాన కార్యక్ర మాలు చేశారు. ఊరేగింపుగా వెళ్లి చెరువులలో నిమజ్జనం చేశారు. గ్రామపెద్దలు, యువకులు మాజీ సర్పంచులు బసిరెడ్డి, మానస, కృష్ణయ్య, రాజు, చెన్నయ్య పాల్గొన్నారు.

● బాలానగర్ : మండలంలోని వివిధ గ్రామాలలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రంలో రెండు రోజులుగా భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలోని భవానీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలలో చిన్నారులు పాల్గొన్నారు. ప్రముఖులు, యువజన సంఘాల సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కష్టజీవుల కోసం పరితపించిన సీతారాం

- వెల్కిచర్లలో ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించిన నాయకులు



వెల్కిచర్లలో ఏచూరికి ఘన నివాళ్లి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

భూత్పూర్, సెప్టెంబరు 15 : దివంగత సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి కార్మికుల, కష్టజీవుల కోసం పరి తపించిన వ్యక్తి అని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వీ.కురుమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికుల సర్వసభ్య సమావేశానికి ము ఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిల్లె గోపాల్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కార్మిక లోకానికి తీర ని లోటు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గ సమ స్యలపై చట్టసభల్లో ఆయన ఎన్నో పర్యాయాలు మాట్లాడారని గుర్తు చేశారు. అంతకు ముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రమ్మ, నాగమణి, నర్సింము లు, నాగయ్య పాల్గొన్నారు.

● హన్వాడ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. మండలంలోని మునిమోక్షం గ్రామంలో ఆదివారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు పార్టీ జాతీయ నాయకులు సీతారాం ఏచూరి, బుద్దదేవ్ భట్టాచార్య, లక్ష్మీదేవమ్మలకు నివాళి అర్పించారు. పేదల అభ్యున్నతికి వారు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మయ్య, బాలయ్య, వెంకటయ్య, శ్రీనాథ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

పాలమూరు, సెప్టెంబరు 15 : ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని చేపట్టే ఇంజనీర్స్ డేను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో విద్యుత్‌శాఖ, మునిసిపల్ ఇంజనీర్లు, ఇరిగేషన్ విభాగం, ఇతర శాఖల్లో పనిచేసే ఇంజనీర్లు ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్ డేను నిర్వహించారు. కె.శ్రావణ్‌కుమార్, ఎ.శంకర్, ముజీబ్దీన్, మజరుద్దీన్‌లు విశ్వేశ్వరయ్యకు నివాళి అర్పించారు.

● జడ్చర్ల : జాతీయ ఇంజనీర్స్‌డే కార్యక్రమాన్ని ఆదివారం జడ్చర్ల సంస్కార భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ఇంజనీర్ బుచ్చయ్యకు సంస్కార భారతి సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జావిద్, రాధాకృష్ణ, క్రాంతి, అమర్‌నాథ్, అశోక్, సుధాకర్, సతీష్ పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇంజనీర్లు

మైనారిటీల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- ఈ నెల 17న డిమాండ్ డేగా జరుపుకోవాలి

- మిల్లి మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 15 : మైనార్టీల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని మిల్లి మహజ్ మహబూబ్‌నగర్ మిల్లి మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్ అన్వర్‌పాషా అన్నారు. జిల్లా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 17 సెప్టెంబరును మత రాజకీయాలు చేస్తున్నారని, హైదరాబాద్‌ను ఏడో నిజాం భారత ప్రభుత్వంలో విలీనం చేశారని తెలిపారు. గత 76 ఏళ్లుగా రాష్ట్రంలో మైనార్టీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం మైనార్టీలు కృషి చేశారన్నారు. ముస్లిం లు ఈ నెల 17న డిమాండ్ డేగా జరుపుకోవాలని కోరారు. ముస్లిం 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ముస్లిం మైనార్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 17న మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేయ నున్నట్లు తెలిపారు. సమావేశంలో కన్వీనర్ తఖీహుస్సేన్, కో కన్వీనర్లు హఫీజ్ ఇద్రీస్, ఖుద్దుస్‌బేగ్, ప్రతినిధులు అహ్మద్‌సనా, అబ్దుల్లా, నూరుల్లా, అబిద్, అబ్దుల్‌సమీ, ఉస్మాన్, సిరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిల్లి మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజాఫయాజుద్దీన్

ఇసుక తరలింపుతో పంట పొలాలు నాశనం

రాజాపూర్, సెప్టెంబరు 15 : మండల కేంద్రమైన రాజాపూర్ సమీపాన ఉన్న దుందుభీ వాగులో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ తమ పంటలను, పొలాలను నాశనం చేస్తున్నారని మండల కేంద్రానికి చెందిన కొందరు రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ పంట పొలాల నుంచి కొందరు మండల కేంద్రానికి చెందిన వారు అక్రమంగా దుందుభీ వాగులో కృత్రిమ ఇసుకను తయారు చేసి తమ పంట పొలాలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా, మండల రెవెన్యూ అధికారులకు, జిల్లా పోలీసు, మండల పోలీసులకు రాత పూర్వకంగా పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసును అక్రమంగా తయారు చేసి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఇసుక తరలించడంతో పంట పొలాలను ధ్వంసం చేస్తున్నారని చూపిస్తున్న రైతులు

నేడు గణేష్ నిమజ్జనం

జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలో గణనాథులను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించిన నిర్వాహకులు సోమవారం వినాయకుడి నిమజ్జనం చేయనున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగసాల సమీపంలోని చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మునిసిపల్, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి నేతృత్వంలో సుమారు 80 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీచౌరస్తాలో నిమజ్జనానికి తరలివెళ్లే గణనాథులకు స్వాగతం పలకనున్నారు.

22న ఒలింపిక్ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 : తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ క్రీడా సంఘం ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఈ నెల 22వ తేదీన సర్వసభ్య సమావేశం, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడానికి అడ్‌హక్ కమిటీ నిర్ణయించినట్లు కమిటీ కన్వీనర్ ఈ. కురుమూర్తిగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నూతన ఒలింపిక్ కమిటీ ఎన్నిక ఉంటుందని, ఉమ్మడి జిల్లాలోని రిజిస్టర్ అయిన క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా శాఖ వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు గార్లపాడ్ రక్తదాన శిబిరం

కోయిలకొండ, సెప్టెంబరు 15 : మండలంలోని గార్లపాడ్‌లో సోమవారం నారాయణపేట కాంగ్రెస్ నాయకులు కే.శివకుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్ టి.రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరాన్ని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, శివకుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

పాలమూరు, సెప్టెంబరు 15 : మహమ్మదాబాద్ పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12నెలలుగా వేతనాలు లేక మహమ్మదాబాద్ గ్రామ పంచాయతీ కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 13వ తేదీ నుంచి సఫాయి పనులు బంద్ చేసి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సమ్మె చేస్తున్న కార్మికులపై కార్యదర్శి బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు.

కళాశాల లైబ్రేరియన్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల, సెప్టెంబరు 15 : ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం జడ్చర్లలో నిర్వహించారు. జడ్చర్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించుకుని, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా సలీంజావేద్, ఉపాధ్యక్షులుగా నరసింహులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా షణ్ముఖరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా విద్యాసాగర్, గౌరవ సలహాదారులుగా జయప్రకాశ్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా ఈద్ మిలాద్-ఉన్- నబీ

మూసాపేట, సెప్టెంబరు 15 : ఇస్లాం మతస్థాపకులు, ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం రాత్రి ముస్లింలు ఈద్ మిలాద్-ఉన్-నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వేముల, జానంపేట, పోల్కంపల్లి, తిమ్మాపూర్ మజీద్‌ల్లో ప్రత్యేక ఈద్ నమాజ్ ప్రార్థనలు, మిలాద్ నాథేషరీఫ్, ధార్మికత సందేశాలను పేష్ఇమామ్‌లు చదివి వినిపించారు ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాలను రంగు రంగు విద్యుత్తు దీపాలతో వైభవంగా అలంకరించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, మతపెద్దలు ఉన్నారు.